

ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డికే బీఆర్ఎస్ మెదక్ ఎంపీ టికెట్?
● ఆర్థికంగా బలంగా ఉండడంతో బరిలో నిలపాలని అధిష్ఠానం యోచన
● టికెట్ ఆశిస్తున్న నలుగురు ముఖ్య నేతలు
7వ పేజీ





సంగారెడ్డి జిల్లాలో 868 టీచర్ పోస్టులు ఖాళీ

● వచ్చే నెలలో మెగా డీఎస్సీ ప్రకటన వెలువడే అవకాశం
● ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆశలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి), జనవరి 18 : సంగారెడ్డి జిల్లాలో వివిధ కేటగిరిలలో 868 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెగా డీఎస్సీ నిర్వహణకు వచ్చే నెలలో ప్రభుత్వం ప్రకటించే అవకాశాలున్నాయి. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి పంపించింది. ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలో జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరి టీచర్ పోస్టులు 5947 మంజూరై ఉన్నాయి. వీటిలో 5079 మంది టీచర్లు పనిచేస్తుండగా 868 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలలో గ్రేడ్ టూ హెడ్ మాస్టర్ పోస్టులు 64, ప్రాథమిక పాఠశాలల హెడ్ మాస్టర్ పోస్టులు 104, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 285, భాషా పండితుల పోస్టులు 24, పీ.ఈ.టీ. పోస్టులు 6, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 385 ఉన్నాయి. అయితే స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల కేటగిరిలలో జిల్లాలో అర్హులైన అభ్యర్థులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరందరూ టెట్ అర్హత సాధించి కూడా ఉన్నారు. అయితే మెగా డీఎస్సీ నిర్వహణ ప్రకటనలో ప్రభుత్వం జిల్లాలో ఏఏ కేటగిరి పోస్టులను ప్రకటిస్తుందోనన్న ఆసక్తి అభ్యర్థులలో నెలకొన్నది.

సంక్షేమ హాస్టళ్లకు పైసల్లేవ్!



9 నెలలుగా బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం

● సంగారెడ్డి జిల్లాలో 93 సంక్షేమ హాస్టళ్లు
● డైట్ చార్జీల బకాయిలు రూ. 6.61 కోట్లు
● కాస్మొటిక్ చార్జీల బకాయిలు రూ. 46,22,702
● తలకుమించిన భారంగా వసతి గృహాల నిర్వహణ
● అప్పు చేసి సరుకులు కొనుగోలు చేస్తున్న వార్డెన్లు
● పట్టించుకోని ప్రభుత్వం, ఉన్నతాధికారులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 18 : సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల బకాయిలు పేరుకు పోయాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లకు సంబంధించి రూ. కోట్లల్లో బిల్లులు తొమ్మిది నెలలుగా విడుదల కావడంలేదు. నిధులు లేక అప్పులు చేసి సరుకులు తెచ్చిస్తున్న వార్డెన్లు చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది. కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేదని, ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తేనే విద్యార్థులకు మెనూ అమలు చేయగలమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు ఇలా

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెస్ చార్జీలను చెల్లిస్తున్నది. 3 నుంచి 7వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.950 చొప్పున చెల్లిస్తున్నది. 8 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,100, ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఇందులోనే వంట గ్యాస్, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, గుడ్డు, పాలు, రాత్రి భోజనం, వారానికి రెండుసార్లు చికెన్ అందజేయాల్సి ఉంటుంది. ఇక కాస్మోటిక్ చార్జీల విషయానికొస్తే నెలకు బాలురకు రూ.62, బాలికలకు రూ.75 చెల్లిస్తారు.

తలకుమించిన భారం

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. హాస్టళ్లలోని విద్యార్థులకు భోజనం ఇతర సదుపాయాలకు నిధులు లేకపోవడంతో వార్డెన్లకు తలకుమించిన భారమవుతున్నది. వ్యాపారుల వద్ద అప్పులతో సరుకులు తెచ్చి, హాస్టళ్ల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి తొమ్మిది నెలలుగా బకాయిలు పేరుకోవడంతో వ్యాపారులు డబ్బుల కోసం ఒత్తిడి తెస్తున్నారని పలువురు వార్డెన్లు పేర్కొంటున్నారు. ప్రతీ నెల బిల్లులను విడుదల చేస్తే ఇబ్బందులు ఇండవని, నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని ఆయా వసతి గృహాల సంక్షేమాధికారులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు, వార్డెన్లు కుమ్మక్కై సరుకులకు ఎక్కువ ధరలు వేయడం లేదా ఎక్కువ మోతాదులో సరుకులను కొనుగోలు చేసినట్లు పేర్కొని తక్కువ మోతాదులో తీసుకోవడం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. సర్కారు నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో సంక్షేమాధికారులు కూడా హాస్టళ్లను తనిఖీలు చేసి మెనూ అమలుపై కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు.

హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	పెండింగ్ బిల్లులు	డైట్ చార్జీల బకాయిలు	కాస్మోటిక్ చార్జీల బకాయిలు
బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు 34	2947	9 నెలలు	రూ.1,61,37,000	రూ.18,72,702
ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు 46	4969	6 నెలలు	రూ.3.5 కోట్లు	రూ.15 లక్షలు
ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లు 13	2000	7 నెలలు	రూ.1.50 కోట్లు	రూ.12.50 లక్షలు
మొత్తం బకాయిలు			రూ. 6,61,37,000	రూ.46,22,702

అవిశ్వాసానికి సై

● సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
● కలెక్టర్‌కు నోటీసులిచ్చిన 22 మంది కౌన్సిలర్లు
● చైర్‌పర్సన్‌పైనే గురి.. వైస్‌చైర్మన్ సేఫ్!
● ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కాంగ్రెస్

సదాశివపేట, జనవరి 18: సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ సీటుకు ఎసరు వచ్చింది. బల్దియాలో 26 మంది కౌన్సిలర్లకు 22 మంది చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై అవిశ్వాసం ప్రకటించారు. పార్టీలకతీతంగా ఏకమైన కౌన్సిలర్లు గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ను తొలగించాలని పేర్కొంటూ అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేయడంతో మార్పు ఖాయంగా మారింది. వైస్ చైర్మన్ చింతా గోపాల్‌పై మాత్రం కౌన్సిలర్లు ఎలాంటి అవిశ్వాసం నోటీసు జారీ చేయలేదు. చైర్‌పర్సన్‌ను గద్దె దింపడంపైనే కౌన్సిలర్లు గురిపెట్టినట్లు అర్థమవుతున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మున్సిపల్ కొత్త చైర్మన్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్‌కు చెందిన చింతా ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అవిశ్వాసంపై ప్రభావం చూపే అవకాశముంది. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి బల్దియా కొత్త చైర్మన్ ఎన్నిక అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు అవిశ్వాసాన్ని తప్పించుకునేందుకు కౌన్సిలర్లతో రాజీ పడేందుకు చైర్‌పర్సన్ ప్రయత్నిస్తున్నారని సమాచారం. అవిశ్వాసం నెగ్గకుండా కౌన్సిలర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారని ప్రచారం తెలుస్తున్నది. మెజార్టీ కౌన్సిలర్లు కొత్త చైర్‌పర్సన్ కావాలనే పట్టుదలతో ఉన్నారని తెలుస్తున్నది. త్వరలో పార్లమెంటు ఎన్నికలు రానుండడంతో అవిశ్వాసం ప్రభావం ఆయా పార్టీలపై పడనున్నది. నాలుగేళ్ల ప్రజలకు సేవలందించి, పట్టణాభివృద్ధికి, పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మను పదవి నుంచి తప్పిస్తే ఆ పరిణామాలు పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించవచ్చని పలువురు భావిస్తున్నారు.



సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్‌కు నోటీసును అందజేసిన 22 మంది కౌన్సిలర్లు

రసకందాయంలో అందోలు-జోగిపేట మున్సిపల్ రాజకీయం

● అవిశ్వాస నోటీసులు ఇవ్వడం ఖాయమంటున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
● పదవి కాపాడుకోవడానికి చైర్మన్ ఎత్తుగడ
● కాంగ్రెస్‌తో సఖ్యత కోసం ప్రయత్నాలు

జోగిపేట, జనవరి 18: అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో అవిశ్వాస రాజకీయం రసకందాయంలో పడింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్లను గద్దె దించాల్సిందేనని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పంతం పట్టారు. పదవిని కాపాడుకునేందుకు చైర్మన్, వైస్‌చైర్మన్ కొత్త ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా.. గత బల్దియా ఎన్నికల్లో 13 వార్డుల్లో బీఆర్ఎస్ సభ్యులు, 6 చోట్ల కాంగ్రెస్ సభ్యులు, ఒక స్వతంత్ర అభ్యర్థి ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 14కు చేరింది. 11వ వార్డు నుంచి గెలిచిన విశ్రాంత విద్యుత్ శాఖ ఉద్యోగి గూడెం మల్లయ్యను చైర్మన్‌గా, అందోలుకు చెందిన మేతరి ప్రవీణ్ (డేవిడ్)ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎన్నిక సందర్భంగా కౌన్సిలర్లకు చేసిన వాగ్దానాలను చైర్మన్ నెరవేర్చకపోవడంతో చైర్మన్‌కు, కౌన్సిలర్లకు పొసగలేదు. దీంతో ప్రతీ కౌన్సిల్ మీటింగ్‌లోనూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. నాలుగేళ్లుగా కలహాల కాపురంలా కౌన్సిల్ కొనసాగుతున్నది. గతేడాది. సొంత పార్టీ సభ్యులే బల్దియా భవనంలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసం నోటీసు ఇస్తున్నామని ప్రకటించారు. అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సముదాయించినా వినకుండా కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. ఆ తరువాత ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాలకు అవకాశం ఇవ్వకపోవడంతో చైర్మన్ పదవి పదిలంగా ఉన్నది. వివాదం ముదరడంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌పై అసంతృప్తి ప్రకటిస్తూ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. మరో ముగ్గురు కూడా పార్టీ మారతారని వినిపించినా మిన్నకుండిపోయారు. దీంతో బల్దియాలో కాంగ్రెస్ బలం 9కి చేరింది. ఎన్నికలు పూర్తవగానే బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌తో సమావేశమై హుందాగా తప్పుకోకపోతే అవిశ్వాసం పెట్టడం ఖాయమని హెచ్చరించారు. అయినా కుర్చీని కాపాడుకోవాలనే పంతంతో ఉన్న చైర్మన్ గూడెం మల్లయ్య మంత్రి దామోదర్‌తో సన్నిహితంగా ఉంటున్నట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లే ఆరోపిస్తున్నారు. వైస్ చైర్మన్‌తో కలిసి తాను కాంగ్రెస్‌లో కలుస్తామని ప్రతిపాదించినట్లు విమర్శిస్తున్నారు. దీనిపై ఇటు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా విముఖతతో ఉన్నారు. తమంతట తాముగా అవిశ్వాసం పెట్టేది లేదని, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెడితే మాత్రం చైర్మన్, వైస్ చైర్మన్లకు అనుకూలంగా ఓటేసేది లేదని కాంగ్రెస్ సభ్యులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మరోవైపు చైర్మన్ వ్యవహారశైలి నచ్చకనే తాము కాంగ్రెస్‌లో చేరితే మళ్లీ ఆయనే చైర్మన్ అంటే తామెలా ఒప్పుకుంటామని బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం పెడితే ఎట్టి పరిస్థితుల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్‌గాకు వ్యతిరేకంగానే ఓటు వేస్తామని చెప్తున్నట్లు తెలిసింది. 18 మంది కౌన్సిలర్లు వత్యతిరేకిస్తుండడంతో చైర్మన్, వైస్ చైర్మన్ తొలగింపు ఖాయమని ప్రచారం జరుగుతున్నది.


అందోలు-జోగిపేట మున్సిపల్ ఆఫీసు

జిల్లా అభివృద్ధిపై నేడు మంత్రి సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18 : సంగారెడ్డి జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ నేడు సమీక్ష నిర్వహించనున్నారు. 'సమీక్ష ఎప్పుడు సార్!' అనే శీర్షికతో ఈ నెల 17 న ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం వచ్చిన విషయం తెలిసిందే. వార్తకు స్పందించిన మంత్రి నేడు సమీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈమేరకు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా మోసం చేశాడని రైస్‌మిల్లు వ్యాపారి అరెస్టు

నర్సాపూర్, జనవరి 18: ప్రభుత్వం నుంచి వడ్లను తీసుకుని బదులుగా ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం ఇవ్వకపోగా.. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 47 కోట్లు చెల్లించకుండా ప్రభుత్వాన్ని, సివిల్‌సప్లై కార్పొరేషన్‌ను మోసం చేసినట్లు ఆరోపణలతో నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్లర్ ఫైడి శ్రీధర్‌గుప్తాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫైడి శ్రీధర్‌గుప్తాకు చెందిన శ్రీపాద రైసుమిల్లు, శ్రీవెంకటేశ్వర రైసుమిల్లు, శివసాయి రైసుమిల్లులకు ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన వడ్లను మిల్లింగ్ కోసం అందజేసిందని తెలిపారు. బదులుగా ప్రభుత్వం నిర్దేశించినమేర కస్టం మిల్లింగ్ రైస్‌ను అందజేయాల్సి ఉంది. కానీస మిల్లర్ బియ్యాన్ని సరఫరా చేయకుండా, డబ్బులు చెల్లించకుండా మోసం చేయడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

అవగాహన కల్పించండి : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 18: అర్హత కలిగినవారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఓటరు నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా అర్హత గలవారిని ఫారం 6లో ఓటరుగా నమోదు చేయించాలని, మార్పుల కోసం ఫారం 8 ద్వారా దరఖాస్తు చేయించాలని వెల్లడించారు. ఇందుకోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని తహసీల్దార్లు దీనిపై దృష్టిసారించాలని నిర్దేశించారు. ప్రతీ పరిశ్రమలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు? వారిలో ఓటరు జాబితాలో పేర్లు లేనివారు ఎవరైనా ఉన్నారా? అని వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు కాని వారుంటే వెంటనే నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని, అర్హులైన విద్యార్థులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీఆర్వో నగేష్‌గౌడ్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం 27 లక్షలు

● మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి ● అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం

మెదక్ అర్బన్, జనవరి 18: హరితహారం లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆయన హరితహారంపై జిల్లా అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 సంవత్సరంలో 27 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించుకున్నామని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు లక్ష్యాను నిర్దేశించాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఔషధ, పూలు, నీడనిచ్చే మొక్కలను, రహదారుల వెంట పెద్ద వృక్షాలయ్యే మొక్కలను నాటాలని నిర్దేశించారు. 2025-26 సంత్సరంలో 25 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

20, 21న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

జాతీయ ఓటరు దినోవత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవో, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు ఉంటుందన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ రాజ్‌శాఖ అధికారులతో సమావేశమై గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులను త్వరగా చెల్లించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రమేష్, ఆయా శాఖల అధికారులు, శ్రీనివాస్, సాయిబాబా, శైలేష్, రవిప్రసాద్, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా




జహీరాబాద్ మండలం శేఖాపూర్ గ్రామంలో పాత పంటల జాతరలో భాగంగా నిర్వహించిన బండ్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు, డీడీఎస్ సభ్యులు

చిరు ధాన్యాలను కాపాడుకుందాం

● డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య

జహీరాబాద్, జనవరి 18: ఆరోగ్యాన్నిచ్చే చిరు ధాన్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య పేర్కొన్నారు. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో గురువారం డీడీఎస్ ఆధ్వర్యంలో పాత పంటల జాతర నిర్వహించారు. చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ పూర్తిస్థాయి పంటలుగా సాగు చేయలేని పరిస్థితుల్లో డీడీఎస్ చొరవతీసుకుని రైతులను చైతన్యపర్చిందని పేర్కొన్నారు. చిరుధాన్యాల వినియోగం, సాగు విధానంపై డీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంతభాగంలో చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. ఇందువల్ల భూసారం కోల్పోకుండా ఉంటుందని, పశువులకు మేతగా ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులకు అవసరమైన విత్తనాలు డీడీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. గ్రామస్థులు, రైతులు సహకరిస్తే ప్రతి గ్రామంలో చిరుధాన్యాలను నిల్వ ఉంచే దుకాణాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ పాతతరం పంటలను గుర్తుచేస్తూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహులు, డీడీఎస్ సిబ్బంది విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, జనరల్ నర్సమ్మ, చుక్కమ్మ, అల్గోల్ నర్సమ్మ, బాలయ్య, చంద్రమ్మ, లక్ష్మమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన పెంకుటిల్లు

హత్నూర, జనవరి 18: షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ఎండీ మజీద్ కుటుంబ సభ్యులు జీవనోపాధి కోసం సంగారెడ్డిలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. గ్రామ సమీపంలోని ఇండస్ట్రియల్ అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేసింది. ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమయినట్లు బాధితులు తెలిపారు

విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

● టీపీటీఎఫ్ నాయకుల పిలుపు


సంగారెడ్డిలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి అర్బన్/రాయికోడ్/జహీరాబాద్, జనవరి 18 : ఖమ్మంలో వచ్చే నెల 11, 12 వ తేదీల్లో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ కోరారు. సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు ప్రాథమిక విద్య దక్కాలని, అందరికీ సమాన విద్య అందాలనే ఎజెండాతో టీపీటీఎఫ్ పనిచేస్తుందన్నారు. మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యను కాంక్షించే వారందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, గోవింద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

●రాయికోడ్: ఫిబ్రవరి నెల 11, 12 తేదిలలో ఖమ్మంలో నిర్వహించే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర టీపీటీఎఫ్ అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మహాసభల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహిస్తున్నాం. మండలం నుండి ఉపాధ్యాయ అందరూ అధిక సంఖ్యలో హాజరై మహాసభలను దిగ్విజయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాయికోడ్ మండల అధ్యక్షులు జి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బి.బీరయ్య, జిల్లా కౌన్సిలర్ జి.రవీందర్, ఆడిట్ కమిటీకన్వీనర్ సయ్యద్‌ఖైరత్ అలీ,ఉపాధ్యాయులు కిషోర్‌బాబు, గోదావరి, శోభారాణి, మంజుల, శ్రీనివాసమ్మ, వేణుగోపాల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

●జహీరాబాద్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మహాసభల పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు ఇర్షద్, జగదీశ్వరయ్య తదితరులు మాట్లాడుతూ ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ వైజ్ఞానిక మహాసభలలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అంతరాలు లేని విద్యా, ప్రజలహక్కు, ప్రభుత్వ బాధ్యత తదితర అంశాలపై మహాసభల్లో చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అందరం తలరివెళ్లాలని వారు చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు కిష్టయ్య, నీలకంటస్వామి, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.


మొగుడంపల్లిలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని సెల్ టవర్ ఎక్కిన నేతలు


మెదక్‌లో సెల్‌ఫోన్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

మెదక్, జనవరి 18 : కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలంటూ మాలమహానాడు నాయకులు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన సంఘటన గురువారం మెదక్ పట్టణంలో చోటుచేసుకున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అద్దంకి దయాకర్ పేరు ప్రకటించకపోవడంతో జాతీయ మాలమహానాడు నాయకులు వెంకటేష్, బత్తుల ప్రసాద్ పట్టణ నడిబొడ్డున రాందాస్ చౌరస్తా వద్ద జీకేఆర్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న సెల్ టవర్ ఎక్కారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అద్దంకి దయాకర్‌కు సమాచారం అందించాలని పట్టుబట్టారు. గంటపాటు హైడ్రామా అనంతరం పోలీసులు వారిని సముదాయించి కిందికి దింపారు. అనంతరం మాలమహానాడు జిల్లా నాయకులు అద్దంకి దదయాకర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీదే

● డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి

కంగ్టి, జనవరి 18: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈ సారి జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకొని తీరుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం కంగ్టి మండలంలో దెగ్లూర్ గుండా మహారాజ్ పీఠాధిపతి చంద్రశేఖర్ మహారాజ్ గారిని దర్శించుకుని ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బాగా రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు జిల్లాకే కాకుండా రాష్ట్రంలోనూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. బీజేపీ అధినాయకత్వం యువత, విద్యావంతులకు అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో తాము కూడా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఆశిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈనెల 22న అయోధ్యలో జరిగే శ్రీరాముల వారిపట్టాభిషేకం కార్యక్రమాన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దత్తాత్రి, మధు, పండరి, బుచ్చిరెడ్డి, శివాజీపటేల్, మోహన్‌రెడ్డి, ప్రతాప్‌పటేల్, కార్తీక్‌రెడ్డి, వేణు, గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు

● తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి

వెల్దుర్తి జనవరి 18: మండల పరిధిలోని హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. హల్దీ వాగు నుంచి కొందరు రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగాఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇసుక తరలిస్తున్న వాహనాలు దొరికితే వాహనాలపై కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే రెండుమూడు సార్లు వాహనాలు పట్టుపడితే, వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా జాగ్రత్తలు పాటించకుండా రోడ్డుపై కేజీ వీల్స్ నడిపితే కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లను ధ్వంసం చేయవద్దని రైతులు పోలంలోకి వెళ్లిన తర్వాత కేజీవీల్స్‌ను బిగించుకోవాలని సూచించారు.

బొల్లారం మున్సిపాలిటీలో 48 శాతం పన్ను వసూళ్లు

● కమిషనర్ సంగారెడ్డి


పన్ను వసూళ్లు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం, జనవరి 18: బొల్లారం మున్సిపాలిటీలో 48 శాతం పన్ను వసూళ్లు చేసినట్లు కమిషనర్ సంగారెడ్డి, ఆర్‌వో శ్రీధర్‌లు తెలిపారు. గురువారం వారు మట్లాడుతూ మున్సిపాలిటీలో 10 కోట్ల రూపాయల పన్నుల వసూలు కావాల్సి ఉండగా మరో 6.50 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 8 కోట్లతో 48 శాతం పన్నుల వసూళ్ల జరిగాయని మరో 8.50 కోట్లు రావల్సి ఉందన్నారు. స్థానిక పరిశ్రమల నుంచి 5 కోట్ల వరకు టాక్స్‌లు వసూళ్లు చేయాల్సి ఉందని నిర్ధిష్ట గడువు లోగా వసూళ్ల కోసం 4 ప్రత్యేక బృందాలతో పన్నుల వసూళ్లు చేపట్టామని వారు తెలిపారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు గ్రీన్‌సిగ్నల్!

● మెదక్ రీజియన్‌లో 93 మందికి ఉద్యోగాలు
● ఆర్టీసీ సంస్థ నిర్ణయంతో బాధిత కుటుంబాల్లో హర్షం



సంగారెడ్డి ఆర్టీసీ డిపో

సంగారెడ్డి అర్బన్, జనవరి 18 : ఆర్టీసీ సంస్థలో ఎట్టకేలకు కారుణ్య నియామకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విధి నిర్వహణలో భాగంగా మరణించిన ఆర్టీసీ సిబ్బంది వారసులతో కారుణ్య నియామకాల కింద పోస్టులు భర్తీ చేయనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాల్సి ఉంది. కానీ పదేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా చితికి జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నిబంధనల ప్రకారం ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు భర్తీ చేసి ఉంటే మృతుల కుటుంబాలకు భరోసా కలిగేది. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ చేపట్టకపోవడంతో బాధిత కుటుంబాలు అసంతృప్తితో ఉన్నారు. తాజాగా కారుణ్య నియామకాలు చేపట్టనుండటంతో బాధిత కుటుంబాల నుంచి హర్షం వ్యక్తమవుతున్నది. ఆర్టీసీ సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంతో ఉమ్మడి మెదక్ రీజియన్ పరిధిలో 93 మంది బాధిత కుటుంబాలున్నాయి. వీరి కుటుంబంలో అర్హతను బట్టి డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్, సెక్యూరిటీ తదితర ఉద్యోగాలు ఇవ్వనున్నారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

● దరఖాస్తు చేసుకున్న 5,796 మంది విద్యార్థులు
● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు


వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

వర్గల్, జనవరి 18 : మానవ వనరుల శాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి 20వ తేదీ శనివారం నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.రాజేందర్ గురువారం తెలిపారు. నవోదయ విద్యాలయంలో 80 సీట్లకు 5,796 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 2,182 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 1,501 మంది విద్యార్థులు, సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 2,113 మంది విద్యార్థులు పరీక్షా రాయనున్నట్లు పేర్కొన్నారు. విధులు నిర్వహించే 29 మంది పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులకు, పరిశీలకులకు, ఇతర అధికారులకు మూడు జిల్లాల ప్రధాన కేంద్రాల్లో గురువారం శిక్షణనిచ్చినట్లు వెల్లడించారు. శనివారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థి హాల్‌టికెట్, పరీక్ష సామగ్రితో కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు.

అన్నారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

● ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు
● గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవానీ హెచ్చరిక


ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం

గుమ్మడిదల, జనవరి 17 : గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 261 అసైన్డ్ లావణి పట్టా భూముల్లో కొందరు చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. కొన్ని రోజులుగా ప్రభుత్వ భూముల్లో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన తహసీల్దార్ గంగభవానీ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను తహసీల్దార్ పర్యవేక్షణలో కూల్చేశారు. వ్యవసాయం కోసం కేటాయించిన భూముల్లో నిర్మాణం ఎలా చేపడతారని సంబంధిత రైతులపై రెవెన్యూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కేటాయించిన భూముల్లో వ్యవసాయం కాకుండా నిర్మాణాలు లేదా ఇతర పనులు కొనసాగిస్తే పట్టాలు రద్దు చేయబడతాయని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గంగాభవాని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంగీత ఉన్నారు.

బ్లాస్టింగును అడ్డుకున్న అధికారులు


దొంతి సమీపంలో అక్రమంగా బ్లాస్టింగు చేస్తుండగా నిలిపివేయించిన అధికారులు

శివ్వంపేట, జనవరి 18: నిబంధనలకు విరుద్ధంగా బండలను బ్లాస్టింగు చేసేందుకు యత్నిస్తుండగా అధికారులు అడ్డుకున్న ఘటన శివ్వంపేట మండలం దొంతి సమీపంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామ సమీపంలోని సర్వే నంబరు 626లో 62 ఎకరాల భూమిని 23 మంది పేదలకు గతంలో అందజేశారు. అయితే అందులో బానగారి వెంకటేశ్‌కు చెందిన 2.20 ఎకరాల భూమిలో పట్టాదారుకు సమాచారం ఇవ్వకుండా, అధికారుల అనుమతులు లేకుండానే కొందరు కంప్రెసర్ ద్వారా అందులో ఉన్న బండలను బ్లాస్టింగు చేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న పట్టాదారు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ఆదేశాల మేరకు ఆర్ఐ సునీల్ ఆధ్వర్యంలో అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని బ్లాస్టింగు పనులను అడ్డుకున్నారు. విచారణ అనంతరం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


లారీని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 18 : అక్రమంగా రవాణా చేస్తున్న 230 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కంది మండలం మామిడిపల్లి చౌరస్తాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. మామిడిపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న లారీ నంబరు కేఏ 39, 5563లో 230 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. లారీ డ్రైవర్ సయ్యద్ ఆబెద్‌షా(34)ను అదుపులోకి తీసుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. బియ్యం లోడ్‌తో ఉన్న లారీని, నిందితున్ని సంగారెడ్డి రూరల్ పోలీసులకు అప్పగించారు.

కేసీఆర్‌ను ఓడించేందుకు ఒక్కటైన జాతీయ పార్టీలు

● ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు ఆయనవైపే
● మల్లన్నసాగర్, కొండపోచమ్మ, తపాస్‌పల్లి రిజర్వాయర్ల నుంచి రైతులకు నీళ్లివ్వాలి
● గజ్వేల్ ప్రజల కోసం 24 గంటలు నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు భరోసా


మాట్లాడుతున్న హరీశ్‌రావు

గజ్వేల్, జనవరి 18 : గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించేందుకు జాతీయ పార్టీలు ఒక్కటయ్యాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌లో 154 నామినేషన్లను వేయించారని, మూడు ఈవీఎంలతో ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారన్నారు. దాదాపుగా 18,750 ఓట్లను చీల్చారని, అయినప్పటికీ గజ్వేల్ ప్రజలు కేసీఆర్ వైపే నిలిచారని గుర్తుచేశారు. కార్యకర్తల కష్టంతో గెలుపొందామన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, చిచ్చులు పెట్టినా 45 వేల భారీ మోజారిటీతో కేసీఆర్‌ను గెలిపించిన గజ్వేల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ఎప్పుడో నిర్వహించాల్సిందని, కేసీఆర్‌కు తుంటిగాయం అవడంతో ఆలస్యమైందన్నారు. త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలకు కేసీఆర్ అందుబాటులోకి వస్తారని, మరో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గజ్వేల్‌కు కేసీఆర్ వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. తాగు, సాగునీరు ఇచ్చామని హరీశ్‌రావు గుర్తుచేశారు. రోడ్లు బాగుపడ్డాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో కేసులు పెట్టడం, కొన్నిలర్లను బెదిరించి అవిశ్వాసాలు పెట్టించడం, సింగిల్‌విండోలలో అవిశ్వాసాలతో అలజడి సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తాము పదేళ్లు ఒక్క కాంగ్రెస్ నాయకుడిపై కేసులు పెట్టలేదని, అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ పనిచేశారని స్పష్టం చేశారు. కేసీఆర్ అభివృద్ధిలో పోటీపడితే కాంగ్రెస్ కేసులు పెట్టడంలో పోటీపడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.100 కోట్ల ఎస్‌డీసీ ఫండ్‌ను రద్దు కాకుండా ఆపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పనులు ఆపితే ప్రజలు తిరగబడతారని, కేసీఆర్ కంటే ఎక్కువ పనులు చేసి ప్రజల హృదయాలను గెలుచుకోవాలన్నారు. రైతులు యాసంగి సాగు చేసుకునేందుకు కాలువలు, చెరువుల్లోకి జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతుబంధు ఇవ్వాలన్నారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గుతుందని వార్తలు వస్తున్నాయని, రైతుల్లో కరెంట్, సాగునీటి విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. గతంలో ఒక్క ఫోన్‌కాల్‌తో కాళేశ్వరం నీళ్లు హల్దీవాగు, కూడవెళ్లి వాగులోకి వచ్చేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు. 24 గంటలు తన ఇంటి తలుపులు గజ్వేల్ ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు తెరిచే ఉంచుతాననని హరీశ్‌రావు భరోసా కల్పించారు.

ప్రతాప్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వండి

కృతజ్ఞత సభలో భాగంగా ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకులు మాట్లాడుతూ మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి ఎంపీ టికెట్‌ను ఇవ్వాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు పార్టీ అభివృద్ధికి, ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ప్రతాప్‌రెడ్డి కృషిచేస్తారని అన్నారు. ప్రతాప్‌రెడ్డి సైతం తనకు ప్రొటోకాల్ వచ్చేలా పదవిని ఇవ్వాలని మంత్రిని సభాముఖంగా కోరారు.

జూటా మాటలతో అధికారంలోకి కాంగ్రెస్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబరు 9న రూ.2లక్షల రుణమాఫీ, రూ.4వేల పింఛన్, రూ.15వేల రైతుబంధు, ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారని కానీ ఇప్పుడు చెతులు ఎత్తేశారని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో 200 బెడ్‌రూంలు, స్విమ్మింగ్ పూల్ ఉన్నాయని నాడు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు అందులో నివాసం ఉంటున్న భట్టిని ఎన్ని రూములు ఉన్నాయని అడిగితే నవ్వుతూ వెళ్లిపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ జూటా మాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రాహుల్‌గాంధీ అంబానీ, ఆదానీ చేతిలో ప్రధాని ఉన్నారని ఆరోపణలు చేస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి వారికి షేక్‌హ్యాండ్‌లు ఇస్తూ ఆదానీని హగ్ చేసుకుంటూ ఫొటోలు దిగుతున్నారని, ఇందులో ఎవరు కరెక్టో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీతో పోరాడుతామని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారని, కానీ వారు కేంద్ర మంత్రులకు పూలదండలు వేసేందుకు పోటీపడుతున్నారని ఆరోపించారు. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, రాథోడ్ బాపురావులను బీఆర్ఎస్ పార్టీ ఓడించిందన్నారు. బీజేపీతో పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, బీజేపీ అండతో గవర్నర్ గతంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టిందని, వాటిని ఇప్పుడు ఆమోదిస్తుందని, దీన్ని బట్టి వారిద్దరూ ఒక్కటేనని నిరూపితమవుతుందన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కావాలని అడిగితే ఇవ్వలేమనడంతో నోర్లు మూసుకున్నారన్నారు. రైతులకు సాగునీరు, కరెంట్, రైతుబంధు ఇవ్వాలని, రైతుల్లో ఆత్మస్థైర్యం పెంచేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు ఎన్‌సీ రాజమౌళి, రాఘవేందర్‌గౌడ్, రాధాకృష్ణశర్మ, అనిల్‌కుమార్, దేవిరవీందర్, దుర్గయ్య, నవాజ్, జకీ, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోగిపేట ఏరియా ఆస్పత్రిని ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం

● మంత్రి దామోదర ఆదేశాల మేరకు ఆసుపత్రి పరిశీలన
● మౌలిక వసతులకు రూ. 2.13 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
● రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

జోగిపేట, జనవరి 18 : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని రాష్ట్రంలోనే ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దనున్నామని వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వెల్లడించారు. జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు ఉండకుండా చూడాలని మంత్రి ఆదేశించారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలోని మార్చురీ గది శిథిలమైందని, ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్లు లేవని, అంతర్గత డ్రైనేజీ లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. ఆస్పత్రిలోని కొన్ని వార్డుల్లో మర్మతులు అవసరమని, ఆక్సిజన్ పైప్‌లైన్‌కు కూడా మరమ్మతులు చేయాలని తమ పరిశీలనలో తేలిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య సదుపాయాల మౌలిక వసతుల కల్పన సంస్థ ఈఈ రవీందర్‌రెడ్డి రూ.2.13 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. నూతన మార్చురీ గదికి రూ.75 లక్షలు, అంతర్గత సీసీ రోడ్ల కోసం రూ.50 లక్షలు, డ్రైనేజీ, టాయిలెట్ల మరమ్మతు కోసం రూ.20 లక్షలు, ఆస్పత్రికి ప్రహరీ నిర్మాణానిక రూ.10 లక్షలు, నూతన సెప్టిక్ ట్యాంక్ కోసం రూ.20 లక్షలు, ఆస్పత్రి భవనాలన్నింటికీ రంగులు వేయడానికి మరో రూ.38 లక్షలు అవసరమౌతాయని తెలిపారు. ఈ మేరకు టీఎస్ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. మంత్రి ఆదేశాలతో ఈ ప్రతిపాదనలను ఆమోదింపజేసి త్వరలోనే నిధులను మంజూరు చేయిస్తామన్నారు.

మెరుగైన సేవలందించాలి

వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ ఆస్పత్రిలోని ప్రతీ వార్డునూ కలియ తిరిగారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సదుపాయాల గురించి రోగుల ద్వారా సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన వైద్యులతో సమీక్ష జరిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ ఆస్పత్రిగా చేయాలనే తలంపుతో మంత్రి ఉన్నారన్నారు. మెరుగైన సేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగారెడ్డి, జోగిపేట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


జోగిపేట ఆస్పత్రిలో మార్చురీ గదిని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

వట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రికి స్థల పరిశీలన

వట్‌పల్లి, జనవరి18: మంత్రి దామోదర ఆదేశాల మేరకు మండల కేంద్రమైన వట్‌పల్లిలో 50 పడకల ఆసుపత్రి కోసం గురువారం స్థల పరిశీలన నిర్వహించారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మధ్యాహ్నం వట్‌పల్లికి చేరుకుని ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారిపై ఉన్న మార్కెట్‌యార్డు పక్కన ప్రస్తుతం పశువుల సంత కొనుసాగుతున్న స్థలం అనువైనదిగా గుర్తించారు. ఇక్కడ ఆసుపత్రి నిర్మిస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని వారు భావించారు. ఈ సందర్భంగా కమిషనర్ అజయ్‌కుమార్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ జోషి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాంరెడ్డి, శ్రీశైలం, దిగంబర్‌రావు, గోపాల్‌రెడ్డి, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

రాయికోడ్, జనవరి 18: మంత్రి దామోదర్ నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేస్తానని గత నెలలో సింగితం గ్రామ పర్యటనలో హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం గ్రామ శివారులో ఎకరా భూమిని పరిశీలించి సర్వే నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, యూత్ అధ్యక్షుడు ఏ.ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

● నాలుగు జిల్లాల్లో 24 నేరాలు
● ఎయిర్‌టెల్ బేస్ బాండ్ యూనిట్‌లు స్వాధీనం
● రూ.6.75 లక్షల విలువైన ప్రాపర్టీ, మూడు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు కూడా
● వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి


నిందితుల వివరాలు తెలుపుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 18 : ఎయిర్‌టెల్ టవర్ల బేస్ బాండ్ యూనిట్‌ల చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను పట్టుకున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల పరిధిలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు మాసిని మహేష్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని భావించాడు. కామారెడ్డి జిల్లాకు చెందిన కైదాపూర్ సంతోష్‌రెడ్డి, గోవ్వూరి రత్నాకర్, కర్రోల్ల రాజాగౌడ్, ముషీరాబాద్‌కు చెందిన మైసని అనిల్, మేడ్చల్‌కు చెందిన పగిడిపల్లి అశోక్, బాగులు, శేఖర్, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్బు, చాంద్ మొత్తం 11 మంది కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. గతేడాది సెప్టెంబర్‌లో రామంతాపూర్ గ్రామ శివారులో సెల్‌టవర్‌ల మెటీరియల్ ఎయిర్‌టెల్ బేస్‌బాండ్ యూనిట్‌లను దొంగలించారు. మెదక్ జిల్లాలో వరసు దొంగతనాలకు పాల్పడ్డారు. కేసును ఛాలెంజ్‌గా తీసుకొని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. గురువారం చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. 24 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 26 నేరాలకు పాల్పడినట్లు వారు అంగీకరించారు. మొత్తం రూ.25 లక్షలకు వారి వద్ద నుంచి రూ.6.75 లక్షల ఆస్తి, మూడు కార్లు, బైక్, ఏడు సెల్‌ఫోన్లు, ఐదు ఎయిర్‌టెల్ బేస్ బాండ్ యూనిట్‌లను స్వాధీనం చేసుకున్నారు. మైసని బాగులు, శేఖర్, మహమ్మద్ అబ్బు, చాంద్‌లో పరారీలో ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసు చేదనకు కృషి చేసిన రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, చేగుంట ఎస్ఐ హరీష్, క్రైం ఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సత్యయ్య, సిబ్బంది బాస్కర్, మహేష్, రాజం, విఠల్, వెంకటేష్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.


స్వాధీనం చేసుకున్న ఎయిర్‌టెల్ బేస్ బాండ్ యూనిట్

దర్గాగా అటవీ భూమి కబ్జాకు యత్నం

● గాజిరెడ్డిపల్లి అడవిలో చెట్ల నరికివేత
● నిర్లక్ష్యంగా ఫారెస్ట్ అధికారులు

హవేళిఘణపూర్, జనవరి 18 : మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన సంఘటన గురువారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కొందరు అడవి ప్రాంతంలో ఉన్న భూమిని లేవల్ చేసేందుకు చెట్లను మిషన్‌తో నరికి వేశారు. పోలీసు, ఫారెస్ట్ అధికారుల రాకపోకలను గమనించేందకు గేటు వద్ద కొంతమందిని కాపలాగా పెట్టుకుని పని కానిచ్చారు. అటవీ అధికారులకు సమాచారమందడంతో అసలు విషయం బయటపడింది. అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు తూతుమంత్రంగా నరికివేసిన చెట్లను పరిశీలించారు. అక్రమార్కులను గుర్తించకపోవడం గమనార్హం. నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గాజిరెడ్డిపల్లిని ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో ప్రతీ రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నా చెట్లు నరికివేతకు గురయ్యాయి. ఇక్కడ ప్రతీసారి అటవీ భూమిని సాగుచేస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు నాలుగు ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు.


గాజిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో దుండగులు నరికిన చెట్లు

వెంకట్రామారెడ్డికి బీఆర్ఎస్ మెదక్ ఎంపీ టికెట్?

● రిటైర్డ్ ఐఏఎస్, ప్రస్తుత ఎమ్మెల్సీకి అవకాశం
● ఆర్థికంగా బలంగా ఉండడంతో బరిలో నిలపాలని అధిష్ఠానం యోచన
● బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న నలుగురు ముఖ్య నేతలు


పి.వెంకట్రామారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్సీ పి.వెంకట్రామారెడ్డి పేరు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామారెడ్డి జిల్లాల పునర్విభజన తర్వాత సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. సిద్దిపేట కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆయన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వీర విధేయుడిగా కొనసాగారు. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుల్లో ఆయన ఒకరుగా ఉన్నారు. కేసీఆర్ సూచనల మేరకు 2021 నవంబరులో కలెక్టర్‌గా వీఆర్ఎస్ తీసుకున్న వెంకట్రామారెడ్డి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా నియమితులయ్యారు. ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వ కాలపరిమితి ఇంకా మూడున్నరేళ్లకుపైగా ఉన్నది. అయినా ప్రస్తుత పరిస్థితులలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పి.వెంకట్రామారెడ్డిని పోటీ చేయించాలని బీఆర్ఎస్ నాయకత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. వెంకట్రామారెడ్డి మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు పార్టీ నాయకత్వానికి సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరింటిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక సెగ్మెంట్‌లలో తెలంగాణవాదం బలంగా ఉండడంతో పాటు పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ ముఖ్య నేత టి.హరీశ్‌రావులు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండడం కలిసి వచ్చే అంశంగా ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఆయన మెదక్ పార్లమెంట్ పరిధిలోని రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని విల్లాలోనే నివాసం ఉంటున్నారు. మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేయడానికి నిర్ణయించుకున్న ఆయన ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనకు పరిచయమున్న వారందరికీ శుభాకాంక్షల సందేశాలను పంపించారు.

ఆర్థికంగా ఉండడం వల్లే..

ఆర్థికంగా బలంగా ఉండడం వల్లే పి.వెంకట్రామారెడ్డిని పార్టీ అభ్యర్థిగా పోటీకి దింపాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని పార్టీ నాయకత్వం నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని ప్రముఖ బిల్డర్లలో ఒకటైన రాజ్‌పుష్పలో వెంకట్రామారెడ్డి కీలక భాగస్వామి. అందువల్లే ఆయన అభ్యర్థిత్వం వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికలంటే ఆ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఖర్చుకు వెనుకాడ కూడదు. ఒక్కో సెగ్మెంట్‌లో కనీసం రూ.15 కోట్లయినా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ రకంగా పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గం మొత్తం మీద రూ.105 కోట్లయినా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకు సిద్ధమైన వారే పోటీ చేయడానికి ముందుకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఒక మాజీ ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

పలువురికి టికెట్ హామీ గాలికేనా?

ఇలా ఉండగా మరో నలుగురు బీఆర్ఎస్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వారిలో ముగ్గురికి గతంలో ముఖ్య నేతలు హామీ కూడా ఇచ్చారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి, గజ్వేల్‌కు చెందిన అప్పటి అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి, ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన గాలి అనిల్‌కుమార్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ టికెట్ ఇస్తామని పార్టీ నాయకత్వం తరఫున ముఖ్య నాయకులు హామీలు ఇచ్చారు. ఇటీవల పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ తనకు పార్లమెంట్ టికెట్ ఇవ్వాలంటూ పార్టీ నాయకత్వానికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ నాయకత్వం కూడా అభ్యర్థి ఎంపికపై పునరాలోచనలో పడింది. ఆర్థికంగా బలమైన అభ్యర్థిని పోటీకి దింపాలన్న ఆలోచనతోనే నాయకత్వం వారందరినీ కాదని వెంకట్రామారెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయాల శుద్ధి


సంగారెడ్డిలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, జనవరి 18: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆలయాలను శుద్ధి చేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం బీజేపీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సమీపంలోని వీరభద్రస్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, చంద్రశేఖర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఖేడ్‌లోని ప్రాచీన కాశీనాథ్ ఆలయాన్ని బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, నాయకులు సంజీవ్‌పటేల్, రాజుగౌడ్, పట్నం మాణిక్, సంతోష్‌రాథోడ్, సంతోష్‌కుమార్, సుగుణాకర్, సాయేందర్, లోకేష్ పాల్గొన్నారు.

సిర్గాపూర్ మండలం వాసర్‌లో భవాని మాత ఆలయాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప శుద్ధి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, సిర్గాపూర్ మండల ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, సుభాష్, నాగ్‌ధర్‌సాయి, శివపటేల్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘన్‌పూర్‌లో రూ.4.50కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల ప్రారంభం


ఘన్‌పూర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, జనవరి 18: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఘన్‌పూర్‌లో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు రూ.4.50కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేజీ టూ పీజీ విద్యావిధానంతో పేదలకు ఎంతో ఉపయోగం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా గ్లాండ్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. త్వరలోనే నియోజకవర్గంలోని 7,000 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుప్రజ, ఎంపీపీ సుష్మశ్రీ, సర్పంచ్ కావ్యరెడ్డి, గ్లాండ్ ఫార్మా సీఎస్ఆర్ మేనేజర్ రఘురామన్, ఎంపీటీసీ సీనారెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ విఠలయ్య, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌నాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాశిరెడ్డి, వెంకట్‌రెడ్డి, దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైత్రీ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు మైత్రీ మినీ స్టేడియంలో మైత్రీ క్రికెట్ క్లబ్ 34వ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, పుష్పనగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, ఎస్ఆర్‌గ్రూప్ ఎండీలు కే.సత్యనారాయణరెడ్డి, సీ.సత్యనారాయణరెడ్డి, ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ గోదావరిఅంజిరెడ్డి, మైత్రీ క్లబ్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, సభ్యులు మధుసూధన్‌రెడ్డి, దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, పృథ్వీరాజ్, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరి మృతి

తూప్రాన్, జనవరి 18: తూప్రాన్ పట్టణ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇరువురు వ్యక్తులు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. తూప్రాన్ - 2 ఎస్ఐ యాదగిరి కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బొడిగె శంకర్‌గౌడ్ (52) గత నెల 23న తూప్రాన్ పట్టణ పరిధి హైవే బై పాస్‌లో ద్విచక్రవాహనంపై వెళుతూ యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో హైవే మీదుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శంకర్‌గౌడ్ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు. తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లికి చెందిన శనగారం మల్లేశ్ (61) ఈనెల 10న తూప్రాన్ పట్టణ పరిధి నాగులపల్లి చౌరస్తా వద్ద బైక్ మీద నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

దుండిగల్, జనవరి 18: దుండిగల్ ఓఆర్ఆర్‌పై వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి క్వాలిస్ బోల్తాపడిన సంఘటనలో గురువారం ఒకరు మృతిచెందారు. సంగారెడ్డి జిల్లా ముత్తంగి మండలం వెలిమల గ్రామానికి చెందిన తలారి నర్సింహులు(36) వృత్తి రీత్యా డ్రైవర్. అతను భార్య, ఇద్దరు పిల్లలు, స్నేహితుడితో కలిసి సిద్దిపేట జిల్లా కొమరవెల్లికి క్వాలీస్‌లో వెళ్లాడు. గురువారం తిరిగి వస్తుండగా సాయంత్రం 5.30 సమయంలో దుండిగల్ ఓఆర్ఆర్ మీద ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి క్వాలీస్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు దుండిగల్ ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు ఆధునిక పంటలపై అవగాహన


నిజాంపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్, జనవరి 18: మండల కేంద్రమైన నిజాంపేటలో రైతులకు ఆధునిక పంటలపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగన్‌చారి, ఏఈవో వంశీ మాట్లాడుతూ.. రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికపరంగా పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘుపతిరెడ్డి, లింగారెడ్డి, నర్సింహారెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన


ముక్టాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగల్‌గిద్ద: మండల పరిధిలోని ముక్టాపూర్, పూసల్‌పాడ్ గ్రామాల్లో గురువారం వ్యవసాయ ఏఈవో మహిపాల్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రోన్‌స్ప్రేయర్, యాంత్రీకరణ ద్వారా కూలీల కొరత లేకుండా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టడంపై అవగాహన కల్పించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అవగాహన కార్యక్రమాల్లో అధికారులు

నర్సాపూర్/సదాశివపేట/జిన్నారం, జనవరి 18: పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున ఎన్నికల కమిషన్ ఈ నెల 20, 21వ తేదీల్లో బూత్‌స్థాయిలో ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం నర్సాపూర్‌లో ఆర్డీవో శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడారు. సదాశివపేట మండలం అంకెనపల్లి, మద్దికుంట గ్రామాల పరిధిలో గల ఎంఆర్ఎఫ్ అంతర్జాతీయ టైర్ల పరిశ్రమలో సంగారెడ్డి ఆర్డీవో రవీంద్‌రెడ్డి కార్మికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌లల్లో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఉండి కొత్తగా ఓటు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు చేపడతారని తెలిపారు. సంగారెడ్డి ఆర్డీవో వెంట ఎంఆర్ఎఫ్ మేనేజర్ పాపారావు, తహసీల్దార్ కె.సరస్వతి, ఆర్ఐ గణేష్ ఉన్నారు. జిన్నారం తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ జయప్రకాష్, ఏఈఈ గౌతమి, ఏఈఎస్ రవీందర్‌లు గడ్డపోతారం పరిధిలోని పలు పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పరిశ్రమల కార్మికులు, ప్రతినిధులతో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.





మద్దికుంట, గడ్డపోతారం గ్రామాల్లో కార్మికులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూ పోరాటాలు చేస్తే అరెస్టు చేస్తారా?

- సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్


సంగారెడ్డిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 18 : పేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని భూ పోరాటం చేసే నాయకులను అరెస్టు చేస్తారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎం నాయకుల అరెస్టుకు నిరసనగా గురువారం సంగారెడ్డిలో ప్లకార్డులతో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసముండే నిరుపేదలకు పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు. నిరసనలో యాదగిరి, యాదవరెడ్డి, నర్సింలు, అశోక్, రమేష్ గౌడ్, శివ, కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి రూ.లక్షా20వేల సాయం

నారాయణఖేడ్/కల్హేర్, జనవరి 18: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి అతని స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన దిడ్డి వెంకటేష్ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వెంకటేష్ చిన్న నాటి స్నేహితులు రూ.లక్ష 20 వేల నగదును పోగు చేసి బుధవారం రాత్రి తుర్కపల్లిలోని కుటుంబ సభ్యులు అందించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రుని కుటుంబానికి సహాయం అందించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు కల్హేర్, సిర్గాపూర్ మండలాలకు చెందిన యువకులు. ఈ నెల 7న రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మరణించాడు. అతని స్నేహితులు మంద శ్రవణ్‌కుమార్, శివకుమార్, శ్రీనివాస్, డాకాగౌడ్, మధుకర్, తుకారాం, ఎండి మౌలానా, సంతోష్ తదితరులు కలిసి లక్షా 20 వేయిల రూపాయల చెక్కును మృతుని భార్యకు గురువారం అందజేశారు.

తారా కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 18 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్ఐ రాములు మాట్లాడుతూ పాదాచారులు జీబ్రా లైన్ల వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ మంగత్‌సింగ్, నాయబ్ సుబేదార్ సులకప్‌సింగ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అసిస్టెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తుల ఆహ్వానం

మనోహరాబాద్, జనవరి 18: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వంటగది అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నదని ప్రిన్సిపాల్ క్రిష్ణతేజ తెలిపారు. ఈ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

రేగోడు జనవరి 18: పెద్దశంకరంపేట నుంచి రేగోడుకు సరఫరా అవుతున్న 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం రేగోడులో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రేగోడు విద్యుత్ ఏఈ యాసిన్ తెలిపారు. రేగోడు, గజవాడ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రాముడి అక్షింతల అందజేత

సంగారెడ్డి రూరల్, జనవరి 18: అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలను సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో అంబరీష్, జగన్, శేఖర్, వీరేశం, ద్వారక రవి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు విష్ణు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పాదుకలకు పూజలు

రేగోడు/వట్‌పల్లి, జనవరి 18: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి పాదుకలను రేగోడు మీదుగా గురువారం తీసుకెళ్తుండగా భక్తులు పూజలు చేశారు. వట్‌పల్లి మండల పరిధిలోని దుద్యాలలో గల సర్వేశ్వరపురి ఆశ్రమంలో అయోధ్య రాముడి పాదుకలకు భక్తులు పూజలు చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నారాయణఖేడ్, జనవరి 18: ఖేడ్ మున్సిపల్ పరిధిలో గురువారం పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి పరిశీలించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి తెల్లవారుజాము నుంచే పలు వార్డుల్లోని కాలనీలు, ప్రధాన రహదారుల్లో పర్యటించారు. పారిశుధ్య కార్మికులు రోడ్లు శుభ్రం చేస్తున్న తీరు, ఆటోల ద్వారా ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు.

మల్లన్నసాగర్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

గజ్వేల్, జనవరి 18: మల్లన్నసాగర్ రిజర్వాయర్ బాధితులను ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు భూసేకరణ చేసిన సమయంలో బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇళ్లకు ఇళ్లు, బడికి బడి, గుడికి గుడి, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటామని మాయమాటలు చెప్పి భూసేకరణ పూర్తి చేసిందన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్‌గా వినోద్


నియామకపత్రాన్ని అందుకుంటున్న వినోద్‌కుమార్

కోహీర్ జనవరి 18: కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా మండలంలోని పిచేర్యాగడి పాత తండాకు చెందిన రాథోడ్ వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ తేజావత్ హైదరాబాదులోని గాంధీభవన్‌లో వినోద్‌కుమార్‌కు నియామకత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రాథోడ్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ అధిష్ఠానం కోహీర్ మండల ఎస్టీ సెల్ బాధ్యతలు అప్పగించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని రాథోడ్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

రైల్వే ప్యాసింజర్ రిజిస్ట్రేషన్ సేవలు షురూ

సంగారెడ్డి రూరల్, జనవరి 18: సంగారెడ్డి జిల్లా జోగిపేటలో రైల్వే ప్యాసింజర్ రిజిస్ట్రేషన్ సేవలను పునరుద్ధరించినట్లు సంగారెడ్డి తపాల కార్యాలయ సూపరింటెండెంట్ ఎల్.వి.మురళీకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. జోగిపేట, పరిసర ప్రాంత ప్రజలు రైల్వే ప్యాసింజర్ రిజర్వేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన

నారాయణఖేడ్, జనవరి 18: మండల పరిధిలోని జూకల్ తండా, వెంకటాపూర్ గ్రామాల్లో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణఖేడ్ కోర్టు న్యాయవాదులు అలిగే జీవన్‌కుమార్, సాయిలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టానికి సమానమే అన్నారు. ప్రతి ఒక్కరికి చట్టాల గురించి అవగాహన ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సంజీవ్, శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం దేవతలగుట్ట స్థలాన్ని రక్షించాలి

- అధికారులకు బీజేపీ నాయకుల వినతి

జిన్నారం, జనవరి 18: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని దేవతలగుట్ట స్థలాన్ని కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటయ్య, గోపి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొల్లారం 278 సర్వే నంబరులో హుడాకు చెందిన భూమిలో ఇటీవల ఓ మతానికి చెందిన ప్రార్థన మందిరం నిర్మాణం చేపట్టారని చెప్పారు. స్థానికుల ఫిర్యాదుతో హుడా అధికారులు ఆ నిర్మాణాన్ని కూల్చివేశారని.. కానీ తిరిగి పనులు జరుపుతున్నారని ఫిర్యాదు చేశారు. దేవతలగుట్టగా పిలువబడే ప్రాంతంలో హిందూ దేవాలయాలే నిర్మించాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించి, నిర్మాణాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎన్‌పీఎల్ లీగ్‌లో కల్హేర్ జట్టు విజయం

కల్హేర్, జనవరి 18: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించిన ఎన్‌పీఎల్ క్రికెట్ లీగ్‌లో గురువారం జరిగిన ఫైనల్ పోరులో కల్హేర్ జట్టు మనూర్ జట్టుపై విజయం సాధించింది. విన్నర్, రన్నర్ జట్లకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు హన్మంత్‌రెడ్డి, రాపర్తి సర్పంచ్ శ్రవణ్‌కుమార్ ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నీరుడి వేణు(యాకోబు), రవీందర్, అన్నారావ్, శ్రీకాంత్, ప్రవీణ్, నాయకులు సాయిరాం, రమేష్, అంజయ్య, పెంటయ్య, వెంకట్, అబ్రహం పాల్గొన్నారు.


ట్రోఫీని అందుకున్న కల్హేర్ జట్టు

రేపు సంగారెడ్డిలో జాబ్‌మేళా

- జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన

సంగారెడ్డి రూరల్, జనవరి 18: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ కంపనీలో 160 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు కార్యాలయ ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు వావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.45 వేల వరకు వేతనాలు ఉంటాయని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన కోరారు. పూర్తి సమాచారం కోసం 08455 - 271010 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ గురుకులంలో ఫిబ్రవరి 26వరకు ప్రవేశాలు

నర్సాపూర్/జోగిపేట జనవరి 18: నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో ఐదోతరగతి, ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి ఐదోతరగతితో పాటు ఇంటర్ ఎంపీసీ, బైపీసీల్లో చేరడానికి దరఖాస్తులు ఫిబ్రవరి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో చేసుకోని వారు నేరుగా మైనార్టీ గురుకులానికి వచ్చి సంప్రదించవచ్చని సూచించారు. వీటితో పాటు 6,7,8 తరగతిల్లోని సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే అందోలు-జోగిపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ముస్లిం, క్రిస్టియన్, పార్సీ, జైన, సిక్కు, బౌద్ధులతో పాటు నాన్ మైనార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు అర్హులన్నారు. పాఠశాలలో 6,7 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్లకు కూడా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 7331170824 నెంబరులో సంప్రదించాలని శోభారాణి సూచించారు.

ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ

నర్సాపూర్‌లోని గిరిజన గురుకులం ప్రతిభ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బాలురు, బాలికలు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్లు

సదాశివపేట: పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాకేష్ పులి తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ 5వ తరగతిలో మైనార్టీలకు 60సీట్లు, నాన్‌మైనార్టీలకు 20సీట్లు, 6వ తరగతిలో 10, 7వ తరగతిలో 8, 8వ తరగతిలో 5 మైనార్టీ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొత్తం 40సీట్లు ఉన్నాయని వాటిలో మైనార్టీలకు 30సీట్లు, నాన్‌మైనార్టీలకు 10సీట్లు అందుబాటులో ఉన్నట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ నెల 18నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా పాఠశాల, కళాశాలల్లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఫిబ్రవరి 6వ చివరి తేదీ అని ఆయన తెలిపారు.

కారముంగిలో పశువైద్య శిబిరం

నాగల్‌గిద్ద, జనవరి 18: మండల పరిధిలోని కారముంగిలో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల మందుతోపాటుపాల దిగుబడి పెరగడానికి తోడ పశువులకు సకాలంలో వ్యాధులు సోకకుండా వ్యాధినిరోధక టీకాలను వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత గుండేరావు, పశువైద్యాధికారి నేతాజీ, అసిస్టెంట్ లక్ష్మి, సిబ్బంది, చంద్రకాంత్, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నాగల్‌గిద్ద, జనవరి 18: ఉపాధి హామి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని దామర్‌గిద్ద ఎంపీటీసీ శేరికార్‌పండరినాథ్‌రావు అన్నారు. గురువారం దామర్‌గిద్దలో ఉపాధిహామి పనులను టెక్నికల్ అసిస్టెంట్ మశ్చందర్‌తో కలిసి ప్రారంభించారు.

రామంతాపూర్ ఎంపీటీసీపై అనర్హత వేటు

మాసాయిపేట, జనవరి 18: మాసాయిపేట మండలం రామంతాపూర్ ఎంపీటీసీ మూడ్ సోని(శోభ)ని అనర్హులుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య కార్యనిర్వహణ జిల్లా అధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం.. కుల ధ్రువీకరణ విషయంలో తృప్తికరమైన అప్పీలు చేసుకోనందున పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎంపీటీసీ మూడ్ సోనిని అనర్హురాలిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలుగువారి ఔన్నత్యాన్ని చాటిన యుగ పురుషుడు ఎన్టీఆర్

- టీడీపీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇల్లెందుల రమేష్

సంగారెడ్డి రూరల్, జనవరి 18: తెలుగువారి ఔన్నత్యాన్ని చాటిన యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని టీడీపీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇల్లెందుల రమేష్ కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి అందరూ సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చివరి శ్వాస వరకు పోరాడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెన్నగౌడ్, ప్రకాష్, హనుమంతరెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో నివాళి

నారాయణఖేడ్, జనవరి 18: ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం ఖేడ్‌లో ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్థం విశ్వనాథ్, మోహన్‌రెడ్డి, బాలాగౌడ్, దిల్‌దార్‌ఖాన్ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో

జహీరాబాద్, జనవరి 18: మాజీ ముఖ్యంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా జహీరాబాద్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఘనంగా నివాళుల్పపంచారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు బండమీది శ్రీనివాస్, ఆంజనేయులు, జైపాల్ మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. మహోన్నతమైన వ్యక్తి మన మధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన ఆశయసాధన దిశగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన హయాంలోనే నిరుపేదలకు ప్రయోజనం చూకూరిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు శివన్న, నాగరాజ్, లక్ష్మణ్, సయ్యద్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో ఘన నివాళి

శివ్వంపేట, జనవరి 18: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో గురువారం ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.


శివ్వంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


సంగారెడ్డిలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


జహీరాబాద్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించిన నాయకులు, అభిమానులు